కథ

# మూలకారణం

మధురాంతకం నరేంద్ర

**గుబురుగా పెరుగుతున్న సుంకిరేసి పొద పక్కనుంచీ ముందుకు తిరిగాక పెద్దగా ఆర్తనాదం చేస్తూ బాబాసామి వెనక్కు గెంతాడు. అతడి చేతుల్లోంచి హేండిలు జారిపోతూనే సైకిలు పక్కకు వొరిగి దబ్బున మరో పొదపైన పడింది. పొదలోంచీ తొండలూ, మిడతలూ కకావికలై పరిగెత్తాయి. పొద కవతలినుంచీ బొంతల గద్దొకటి రివ్వున పైకెగిరింది. చెట్ల కొమ్మలపైన కూర్చున్న కాకులు పెద్దగా అరిచాయి.**



"యేమన్నా! యేం జరిగిందన్నా?" అని అడుగుతూ కిట్టమ్మ బెంబేలు పడిపోయింది.

పెదవులూ, నాలుకా యెండుకు పోవడంతో బాబాసామికి మాటలు పెగల్లేదు. నిప్పులు తొక్కుతున్నట్టుగా రెండు మూడు సార్లు ముందుకూ వెనక్కూ గెంతాడు. తరువాత సైకిలును లేవదీసి వెనక్కు తిప్పుకుంటూ "పోదాం పద కిట్టమ్మా!... ఆ పక్కన... పీనిగ..." అంటూ సగం సగం మాటలకు హావభావాల్ని కలిపి పూర్తి వార్తను ప్రసారం చేశాడు బాబాసామి.

కిట్టమ్మ లావుపాటి శరీరం పొదల మధ్యలో వున్న మట్టిబాటపైన రుబ్బురోలు దొర్లుతున్నట్టుగా పరిగెత్తింది. రెండు బారలు పరిగెత్తాక వున్నట్టుండి శరీరమంతా బండబారిపోయినట్టుగా ఆగి పోయి 'అది... అట్ల... జూడు... ఆ గుడ్డ... ఆ పేలిక' అంటూ పొడిపొడి మాటలకు యేడుపును జతచేసిందామె.

"దాంతో మనకేం పనిలే.... నువ్వు పద.... పరిగెత్తు..." బాబాసామి సైకిలును తోస్తూ హెచ్చరించాడు.


"అది గాదన్నా... అది... ఆ చొక్కాయి గుడ్డ... అది"

"అది చొక్కాయి గుడ్డేలే గానీ పద..." అని సర్ది చెబుతూ పరిగెత్తబోయిన బాబాసామి వెంటనే నాలిక కరచుకుని "కొంపదీసి అదేమైనా యేకాంబరందా!" అని ప్రశ్నించాడు. నిలువునా వణికి పోతున్న కిట్టమ్మను జూశాక విషయం అర్థముపోయినట్లుగా "అయ్యయ్యయ్యో! యెంత పని జరిగిపొయ్యింది కిట్టమ్మా!" అని యెలుగెత్తి ఆక్రోశించాడు. యింతలో మరచిపోయిన విషయ మేదో జ్ఞాపకం వచ్చినట్టుగా "ఆ దొంగముండా పులి

యింగా ఆడ్నేవుండాదేమో! లగెత్తు లగెత్తు...'' అని చెబుతూనే సైకిలు పైకెక్కి గబగబా ఫెడల్లు తొక్కబో యాడు. ''నేనన్నా నేను కూడా'' కిట్టమ్మ గూడా అరుస్తూ నేల రంధ్రాలు పడిపోతుందేమోనన్నట్టుగా పాదాల్ని భూమిపైన మోపుతూ పరిగెత్తింది.

బైపాస్‌రోడ్డు దగ్గరి నుంచీ కొండలపైదాకా వ్యాపించిన అడవి నీరెండలో పచ్చల ద్వీపంలా మెరు స్తోంది. యేపుగా పెరుగుతున్న చెట్ల మధ్య పిచ్చిమొ క్కలు పొదలుగా బలుస్తున్నాయి. మనుషులు నడ వడం వల్ల యేర్పడిన సన్నటి మట్టిబాటలో రకరకాల జంతువుల పాదముద్రలు గజిబిజిగా కలిసిపోతు న్నాయి... గస బోసుకుంటూ బైపాస్ రోడ్డులోకొచ్చి పడ్డాక వెనుదిరిగి, స్టాండుపైన కిందికి జారిపోతున్నట్టుగా కూర్చున్న కిట్టమ్మతో ''యెంత పనిజేసినావు కిట్టమ్మా! పనికి రాని ముండ్ల కట్టెలకోసం బంగారట్లా మడిసిని పోగిట్టుకుంటివే!'' అని వాపో యాడు బాబాసామి.

కిట్టమ్మ రెండు చేతులూ పైకెత్తి



''అయ్యయ్యో! యింగ నేనేం జేసేదిరా దేవుడా!'' అని యెలుగెత్తి యేడ్చేసింది. స్టాండుపైన్నుంచీ పట్టుజారి తారురోడ్డుపైన ఢబేలుమని పడ్డాక ''దీంట్లో నేను జేసిందేముండాదన్నా!.... నాదేం తప్పుండాది దీంట్లో..'' అని మళ్లీ పెద్దగా రాగం తీసింది.

''నోర్మూసుకో!'' భయంతో యెండుకుపోతున్న పెదవుల్ని నాలుకతో తడుపుకుంటూ బాబాసామి మందలించాడు. ''జరిగింది సాలదా? ఆగడం జేసు కోని యీధిలో పడతావా? యెవురికైనా యీ సంగతి తెలిస్తే యింగేమైనా వుండాదా? ముందుగా దీనికి దేవస్థానం ఫారెస్టోళ్లకు అపరాధం గట్టాల.... ఆనక కోర్టులకూ, పోలీస్టేషన్లకూ దిరగాల్ల. యీ యవహా రంలో వుత్తల పుణ్యానికి నన్ను గూడా చిగిలించేట్టుం డావు... నేను పోతాను''.

కిందికి జారిపోతున్న పయిటను గూడా పట్టించు కోకుండా కిట్టమ్మ రెండు చేతులతోనూ సైకిలు స్టాండు గట్టిగా పట్టుకుని ''నన్ను వొంటిగా యిడిసి పెట్టిపోవ ద్దన్నా! వొంటి ఆడదాన్ని... నన్ను నువ్వే కాపా డాల్ల...'' అని యేడుస్తూ ప్రాధేయపడింది.

''అయితే గుట్టుగా స్టాండుపైకెక్కి కుచ్చో... మనం ఆ తావుకు బొయ్యిండేది యెవురైనా చూసి నారో యేమో...'' అన్నాడు బాబాసామి బొంగురు పోతున్న గొంతుతో. యేడుస్తూనే కిట్టమ్మ, యెగిరి స్టాండుపైకి చతికిల బడింది. యెదురుగా కారొకటి రావడం కనబడగానే బాబాసామి తలను వెనక్కు తిప్పుకున్నాడు... హేండిలు గట్టిగా పట్టుకుని బలమంతా వుపయోగించి వేగంగా ఫెడల్లు తొక్కసాగాడు.

భారతీయ విద్యాభవన్ స్కూలు ముఖద్వారం దగ్గర ఆటోలు పిల్లలకేరింతల్ని మోసుకెళ్తున్నాయి. సైన్సు సెంటరు ముందు రోడ్డుకు వారగా పాత లారీ వొకటి ఆగి వుంది. మరో లారీ దాని వెనకనే జోగు తోంది. అలిపిరి కాలిదోవను యాత్రికులు గోవింద నామస్మరణతో మోతెత్తిస్తున్నారు. టోలు గేటుకు వుత్త రంగా, కాలి బాటపక్కన చక్రాల బండ్లపైన వుపాహా రాల అమ్మకం జోరుగా సాగుతోంది.. రోడ్డు పక్క నున్న వొక కమర్షియలు కాంప్లెక్సు దగ్గరికి వెళ్లాక ''యింగ తొక్కలేను. కొంచేపు కుచ్చోవాల్సిందే!'' అంటూ బాబాసామి సైకిలు స్టాండేసి వోషాపు ముందున్న చెక్క బెంచీపైన సోలిపోయాడు. కిట్టమ్మ గూడా వెంటనే బెంచీపైన చతికిలబడింది. చెమటతో ఆమె తలంతా ముద్దయిపోయి వుంది. ముఖంలో కన్నీళ్లు ధారలు గట్టుకు పోతున్నాయి. ఆమె శరీరం గజ గజ వణుకుతోంది.

''రెండు టీలు... ముందుగా రెండు గ్లాసుల నీళ్ళు'' అని హోటలు కుర్రాడికి చెప్పాక ''కొంచెం ఆ యేడుపు ఆపుకో కిట్టమ్మా!'' అని మందలించాడు బాబాసామి.

''యిప్పుడో యింకొంచేపుటికో యీ సంగతి పోలీ సులకు తెలిస్తింది. వాళ్లొచ్చి అడిగేదాక నోరు తెర వద్దు. యీ లోపల యీ మాదిరి ఆగడం జేసినావంటే మొదటికే మోసం వస్తింది... నువ్వే యేమైనా జేసినా వనకుంటారు. లేకపోతే నన్నుగూడా యీ రగడలోకి లాగేస్తారు... అది తెలుసుకో...'' రెండు నిముషాలా గాక మళ్లీ ''యెంత పని జేసినావు కిట్టమ్మా! పనికిమా లిన కంపల కోసరం మనిషినే పులియదా నేసేస్తివే!'' అని వాపోయాడు.

కిట్టమ్మ నిలువు గుడ్లేసుకుని బిత్తరచూపులు చూస్తూ గుక్కిల్లు మింగసాగింది. తన్నుకొస్తున్న వెక్కి ళ్ళతో ఆమె శరీరమంతా యెగసిపడుతోంది. హోటలు కుర్రాడు ఆమెకేసి అనుమానంగా చూస్తూ టీ గ్లాసు అందించాడు... మెల్లగా రాగం తీస్తూనే ఆమె టీ గ్లాసును పెదవుల కతికించు కుంది. టీ తాగుతున్న బాబాసామి చూపులు జిల్లేడు విత్తనాల్లా గాలిలో గిరి కీలు కొడుతున్నాయి.

కాస్సేపయ్యాక యేడుపుతో రాసుకుపోయిన కీచుగొంతుకతో ''యీ మూలలేని మనిషి యెంత పని జేసినాడో చూస్తివాన్నా... కడుపులో నామీదెంత కసి పెట్టుకోనుండాడో జూస్తివాన్నా! పొయ్యే వాడు పోకుండా నా మిందెంత నిందేసి పోతావుండాడో జూడన్నా!'' అని గొణిగింది.

బాబాసామి వింటున్నాడో లేదో తెలియడం లేదు.

''యిట్లాంటి మొగోనికి పెండ్లాంగా వుండేదాని కంటే అడివిలో చెట్టుగా వున్నా బాగుంటింది. తెలిసి తెలిసీ యిట్లాంటి వొకటి సగం మనిషికి తగలగట్టి తరి

మేసినారు. తినేదీ పండుకునేది తప్ప యింకేమీ తెలవనోన్ని మనిషనియెట్లా పిలస్తారు? కాలూ చెయ్యిలేని అవిటోళ్లతో గూడా సంసారం జెయ్యొచ్చు. యీ మాదిరి మెదడు పెరగకుండా యెలుంగొడ్డు మాదిరి బతికే మడిసికి పెండ్లాంగా యెట్ల బతకతారు? గొడ్డు మోతు పనులు జేసే దాని కోసరమని పెద్ద మేస్త్రీలు యెతుక్కుంటూ వస్తారు గానీ యింకెవరూ తలవరు..'' మాటల్నీ, యేడుపునూ కలగలిపి పెద్దగా రాగం తీస్తున్న కిట్టమ్మ బాబాసామి వురిమి చూడగానే నోరుమూసుకుంది. అతను ముఖమటు తిప్పుకోగానే ''యీ మనిషి యెప్పుడో వొకప్పుడు యిదేమాదిరిగా పోతాడని తెలుసు. యే బస్సు కిందో, లారీ కిందో పడతాడనే అనుకున్నా... అయితే యీ మాదిరి నన్ను అగుడు జేసి పోతాడని మాత్రం అనుకోలేదు. ఆ దొంగముండా పులి అరిసి గోండ్రించినా యినబడుండదు... పొయ్యేనోడు గొమ్మునా పోకుండా నాపైనెంత బండ పెట్టేసి పోయినాడో చూస్తివారా ముండ దేవుడా!'' అంటూ రాగం దీయసాగింది. బాబాసామి ఆమెకేసి విసుగ్గా చూస్తూ బీడి వెలిగించుకున్నాడు.

టీ హోటలు ముందర యాత్రికులు కొందరు గుంపుగా నిలబడి తీవ్ర స్థాయిలో యేదో చర్చించుకుంటున్నారు. రోడ్డు పైన వాహనాలు వెంట వెంటనే పరిగెడుతున్నాయి. కొండపైకి వెళ్లే కాలిబాటపైన యాత్రికులు రకరకాల గొంతులతో అలజడి సృష్టిస్తున్నారు.

కిట్టమ్మ మరికాస్త బాబాసామికేసి వొరిగి ''నేను తిన్నా తినకపోయినా నీకు ముక్కలదాంకా పెడతావున్నాను గదా! నువ్వు తెచ్చిచ్చే కూలీ దుడ్డుతో సంసారం జరిగితిందా! రెండిండ్లల్లో పాచి పనిచేసుకోనొచ్చి నీ కడుపుకు బెట్టినాను గదా! నామిందే నిందేసి పోదామని జూస్తావా నువ్వు? యిదేం ఘోరకలిరా!'' అంటూ మళ్లీ రాగం తీసింది.

''వోడు వోడని అంతా వోడనద్దు కిట్టమ్మా'' బాబాసామి కోపంగా అడ్డు తగిలాడు. ''వాడు అందరి మాదిరిగా అన్నీ సక్రమంగా వుండే మనిషి గాదు. నిజమే! వానికి చూపు మట్టం. చెవుడు. మెదడు పెరక్కుండా పొయ్యింది. గొడ్డుమాదిరి పడుండాడు. అదీ నిజమే! అయితే వాన్ని మేస్త్రీలంతా యెగస్పర్టని పిలస్తారు తెలుసునా! డాక్టర్లలో కంటికొకరూ, చెవుల కొకరూ ప్రత్యేకంగా పెసల్ డాక్టర్లుండ్లా! ఆ మాదిరిగా యేకాంబరం గూడా గోకే పనిలో యెగస్పర్టు... యేదైనా గ్రిల్ తలుపుల్నో, సిమెంటు గోడనో, చెక్కల్నో గోకాలంటే అందరూ యేకాంబరం కోసరమే చూస్తారు. పట్టుకున్న పని అయ్యేదాంకా వాడు ఆ తావునించీ కదలడు. అట్లాంటి పనోడ్ని యింగేడ జూడ పోతాంలే..'' బాబాసామి గొంతు యేడుపుతో జీరబోయింది. రెండుసార్లు ముక్కుచీదుకున్నాక ''వానికేదీ కనబడదు, యినబడదు. ముందే యిది పులులూ సింగాలు తిరిగతా వుండే అడివి. తెలిసి తెలిసీ యాభై రూపాయల కట్టెలమోపు కోసరమని చేతులారా యెంత పని చేసుకుంటివి కిట్టమ్మా?'' అని బాధగా ప్రశ్నించాడు బాబాసామి.


కిట్టమ్మ కళ్ళు మూసుకుని తలను లోలకంలా అటూయిటూ వూపుతూ సర్దుకోవడానికి ప్రయత్నించింది. తరువాత మెల్లగా యేడుపురాగం తీసి క్రమంగా మాటల్లోకి మారింది. ''నువ్వు తెచ్చిచ్చే దుడ్డేజూస్తారు గానీ నీకు జేస్తావుండే కర్చు నెవరూ జూడాటంలేదే! పొద్దన్న పది రూపాయల యిడ్లీలు వొక పంటి కిందికి గూడా రావే! మద్యానం కారియరు గట్టి అంపించినా ఆ పాడు హోటళ్ల నించే తెచ్చుకోని మింగస్తావే! పెండ్లామనే పేరేగానీ వొక సుగముండాదా, వొగ మంచండాదా, వొక చెడ్డుండాదా నాకు? పొయిన జన్మంలో చేసిన పాపం మాదిరిగా తగులుకుంటివే నాకు''.

''ఛత్... గొమ్మనుండు కిట్టమ్మా! యెంత మూల లేనోడైనా వాడు నీకు మొగుడు. వాడు పోయినాడని యేడవకుండా నిన్నేదో ముంచేసి పోయినాడని యేడస్తావుండావేంది నువ్వు చేసింది చాలుగానీ చక్కా యింటికిపో! పోలీసులొచ్చి సంగతి చెప్పేదాకా యేమీ తెలవనట్టుగా నీ పనులు జేసుకో... ఆలోపల నోరు జారినావంటే మొదటికే మోసం వస్తింది. నేను కిష్టానగర్ పోవాల'' అన్నాడు.

''నేనా? యింటికి... యిప్పుడా? వొంటిగా నేనా?'' కిట్టమ్మ కళ్ళు పెద్దవిగా చేసుకుని పైకి దుముకుతున్న పులిని చూస్తున్నట్టుగా బెదిరిపోసాగింది.

''యింటికి గాక యింకేడికి పోతావు? పోలీసు స్టేషనుకు పోతావా జెప్పు?'' బాబాసామి విసుగ్గా ప్రశ్నించాడు.

కిట్టమ్మ కన్నీళ్లు జారుతుండగా కనురెప్పలు టపటపలాడించి, రెండు అరిచేతులనూ పెదవుల పైన పెట్టుకుని యేడుపు నాపుకోవడానికి ప్రయత్నిస్తూ ''యీపాటికా మనిషి దెయ్యమై పొయ్యుంటా డన్నా! యింట్లో నా కోసరం కాపెట్టుకోనుంటాడు. నేను చేతికి దొరికినానంటే జవురుకునేస్తాడు'' అంది.




బాబాసామి కోపంగా నిట్టూర్చి ''దెయ్యాలు లేవు బూతాలు లేవు. గొమ్మనా యింటికిపో... సాయంత్రం దాకా జూసినాంక కావాలంటే మనమే పోలీసు రిపోర్టిద్దాము. అంత దాంకా ఆ నోటికి గెట్టిగా కాయేసేయ్'' అని చెప్పిందే మళ్లీ వల్లించాడు.

కిట్టమ్మ కొంగుతో కన్నీళ్ళు తుడుచుకున్నాక ''అట్టనద్దన్నా! పోయిన సంవత్సరం మా పక్కింటి ముసిల్ది చచ్చిపోయినాంక దెయ్యమైపొయ్యి దాని కోడల్ని గుంటికీ మిట్టకూ యీడ్చి కన్నగసాట్లు పెట్టింది నా కండ్లతో నేను జూసినాను. నాలుగ్గాళ్ళ మండపం కాడ ఆంజనేయసామి గుడిలో అంత్రం గట్టించి నాంక గానీ యిడిసి పెట్టలేదు'' అంది.

''అయితే యిప్పుడు ముందుగా నీకు అంత్రం గట్టించాలంటావా?'' అంటూ బాబాసామి గుడ్లురిమి చూశాడు.

ఆమె బాబాసామి కేసి భయం భయంగా చూస్తూ ''అది గాదన్నా! ఆ దెయ్యం యింటికే పొయ్యింటాది. సాయంత్రం నలుగురూ వచ్చేదాంకా నేనాయింటికి పోనన్నా!'' అంది జాలిగా.

యెండ పైకెక్కేసరికి అలిపిరి కొండలు పచ్చ రంగు పటకాల్లా మెరవసాగాయి. జనాలంతా నీడల కిందికి చేరుతున్నారు. కొండెక్కుతున్న యాత్రీకులతో మెట్లదారి కిటకిటలాడుతోంది. టోల్ గేటు దగ్గర బస్సులు క్యూలో నిలబడుతున్నాయి.

కిట్టమ్మ వెక్కిళ్ళు పెట్టాక 'అడివిలో ఆ మనిషిట్ల పడుంటే యింటికి పొయ్యే దానికి మనసు యిచ్చగిస్తిందాన్నా! ఆ ముండా పులి అడవి లోపలికి యింకా లాక్కోనిబోతే యేంజేసేది? బిన్నాగా దీనికేదైనా దోవజూడన్నా! నీకు పుణ్యముంటాది'' అని ప్రాధేయపడింది.

బాబాసామి చేతి వాచీ చూసుకున్నాక ''పన్నెండవతా వుండాది. పొద్దన లేస్తానే యెవురి మొగం జూస్తినో! మేలు జెయ్యబోయి మెడకు తగిలించుకున్నట్లయ్యింది నా గతి. నువ్వు నాకు దెయ్యం మాదిరిగా తగులుకున్నావు'' అని కసిరాడు. జేబులోంచి సెల్ ఫోను తీసుకుని నెంబరు వెతుక్కో సాగాడు. తరువాత ఆమెకేసీ అనుమానంగా చూస్తూ దూరంగా వెళ్ళి నిల్చున్నాడు. మాట్లాడడం ముగించాక ఆమె దగ్గరికొచ్చి ''మావోడొకడు పోలీసుగా వుండాడు. యిప్పుడు టేషన్లోనే వుండా డంట. పదంటే పదే నిమిషాల్లో యీడుంటానన్నాడు'' అన్నాడు.

''యెవరూ? పోలీసా?'' శరీరమంతా యెగసిపడేలా కిట్టమ్మ వులిక్కి పడింది. ''పోలీసులకు దొరక్కుండా సాయంత్రం దాకా యింట్లో దాంకోమని నువ్వేగదన్నా యిప్పుడు జెప్పింది? యిప్పుడు నువ్వే పోలీసుల్ని పిలిచి నన్ను జైల్లోకి తోయించాలనుకుంటూ వుండావా?'' ఆమె బోరుమని ఏడవసాగింది. హోటలు ముందు నిల్చున్న యాత్రికులు ఆమె వైపుకు తిరిగి చూశారు. హోటలు కుర్రాడెందుకో పళ్లన్నీ కనిపించేలా నవ్వసాగాడు.

''నువ్వు కొంచెం సమాళించుకో! చూసే వాళ్ళు నేనే నిన్నేమో చేసినానకునేస్తా వుండారు'' బాబాసామి గొంతు బాధతోనూ కోపంతోనూ జీరబోయింది. ''వాడు మావోడేలే! కేసులూ గీసులూ లేకుండా జూసుకునే దానికి పిలిచాను వాణ్ణి! అయినా జైలు కేసేటంత అపరాధమేం జేసినావు నువ్వు. వాడే మూలలేనోడంటే వానికంటే మూల్లేని పెండ్లాం నువ్వు! పులి తిరగతా వుండేది తెల్సుంటే ఆ మనిషి కాపని చెప్పుందువా చెప్పు?'' అన్నాడతను. బీడి వొకటి వెలిగించుకుని రెండు దమ్ములు లాగాక ''వాడు దెయ్యమై నిన్ను బట్టుకుంటాడని బెదిరి చస్తా వుండావు. పోలీసులొచ్చి జైలు కంపిస్తారని అడిలి పోతావుండావు. నిన్ను జూస్తావుంటే నాకేదో అనుమా

నంగా వుండాది కిట్టమ్మా! వాడు నోరూ వాయీ లేనోడు. బతికుండగా వాన్ని నువ్వు సక్రమంగా గమనించుకోని చూళ్లేదనిపిస్తా వుండాది నాకు..'' అంటూ కళ్లు చిట్లించుకుని ఆమె ముఖంలోకి సూటిగా చూశాడు బాబాసామి.

కిట్టమ్మ ముఖం వెలాతెలా పోయింది. ఆమె కనురెప్పలు పదేపదే కొట్టుకుంటూ కన్నీళ్ళను జలజలా రాల్చాయి. చలిలో వణుకుతున్నట్టుగా ఆమె పళ్ళు పటపటలాడాయి. వెన్నెముక లోకి చల్లగా యేదో ప్రాకుతున్నట్టుగా ఆమె శరీరం వణకసాగింది. పొంగి వస్తున్న యేడుపును ఆపుకోడానికి మునిపళ్లతో పెదవిని కొరికి పట్టుకున్నాక ''అంతమాటనద్దన్నా! పెండ్లయ్యినప్పటి నుంచి నేను పడిన అగసాట్లు నాకు తెలుసు, ఆ భగమంతుడికి తెలుసు'' అంది కిట్టమ్మ. ''నువ్వు గూడా పది పదైదేండ్లుగా ఆ మనిషిని చూస్తానే వుండావు. అందురి మాదిరిగా మామూలుగా వుండే మనిషిగాడు గదా చెప్పు! యీ మనిషికి తిండి నిద్రా వుంటే చాలు. కొంపొకటీ, దాంట్లో వండివార్చేదానికి వొక ఆడమనిషి వుంటే చాలు. యేదో మీ అట్లా ధర్మాత్మంగా వుండే పెద్ద మేస్త్రీలు కనికారంతో పనులు యిస్తా వుంటారు గాబట్టి సరిపొయ్యింది. యెప్పుడో వొగప్పుడు యీ పనులు గూడా రాకుండా యింట్లో గొమ్మునా గుచ్చుంటాడేమో అని యెప్పుడూ నాకు బయమే! మొగోడొకడు యింట్లో వుండాడని పేరే గానీ మొగ పనులూ, ఆడ పనులూ నేనే జేసుకోవాల్లా... పిల్లోడ్ని యీస్కూలుకు గూడా అంపించలేక పోయినాను...'' బాబాసామి చూపులు తనను గుచ్చి గుచ్చి చూస్తున్నట్టనిపించగానే కిట్టమ్మ కంగారు పడిపోయింది. మరచిపోయిన విషయం జ్ఞాపకం వచ్చినట్టుగా మళ్లీ పెద్దగా యేడ్చేసింది. రాగం తీస్తూనే ''యిట్లాంటి మొగోడికి పెండ్లాన్నని జెప్పి వూర్లో వాళ్ళంతా నా పక్కకదో మాదిరిగా జూస్తారు...'' అని గొణిగింది.

''నీ కొడుకు... వాడు...'' అంటూ బాబాసామి యేదో అడగబోయి అంతలో సందేహిస్తూ ఆగిపోయాడు. తరువాత అదోలా వంకర నవ్వు నవ్వి ''వాడేం చేస్తాడు'' అని ప్రశ్నించాడు.

అతను అడగబోయిన ప్రశ్నేదో తెలిసిపోయినట్టుగా కిట్టమ్మ అంత యేడుపులోనూ బుసగొట్టింది. గుక్కిళ్ళు మింగుతూ, వెక్కిళ్ళు పెడుతూ, బొంగురుపోతున్న గొంతుతో ''బయిపెట్టేదానికి సరైన మనిషి లేకుండా పోతే యెపుడైనా యేమయితాడు? మావోని మాదిరిగా వొగయిపోతాడు'' అని ముఖాన్ని అవతలికి తిప్పుకుంది.

అలిపిరి కాలిబాటలో పసుపురంగు దుస్తులు గట్టుకున్న భక్తుల గుంపొకటి కన్నడంలో భజన చేసుకుంటూ వెళ్తోంది. గరుత్మంతుడి విగ్రహంపైన కూర్చున్న కాకొకటి టోల్‌గేటును యెగతాళి చేస్తున్నట్టుగా చూస్తోంది. పెద్దగా హారను మోగిస్తూ వెళ్తున్న అంబులెన్సును చూడగానే కిట్టమ్మ మళ్లీ యేడుపు మొదలు పెట్టింది.

నల్లరంగు మోటారు సైకిలొకటి హోటలు ముందుకొచ్చి ఆగింది. బాబాసామి కాకీ దుస్తుల్లో వున్న వ్యక్తికేసీ నడిచాడు. అవయవాలన్నీ అదుపు తప్పి పెరగడంతో దీర్ఘ చతురస్రం పైన చతురస్రాన్ని అతికించినట్టున్న ఆకారమున్న వ్యక్తి కాలు నేలపైకి అన్చాడు. బాబాసామి అతడి చెవిదగ్గరికి వంగి గుసగుసలు పోయాడు. పోలీసు జేబులోంచి సిగరెట్టు పెట్టె పైకి తీశాడు. పెదవుల మధ్య సిగరెట్టు పొగల్ని చిమ్ముతుండగా మోటారు సైకిలుతో బాటూ కిట్టమ్మ ముందుకొచ్చి ఆగాడు. ఆమెకేసి ముఖమైనా తిప్పకుండా ''నీ మొగుడు యింటికాన్నుంచీ యెన్ని గంటలకు బయల్దేరి నాడు?'' అని వాకబుచేశాడు.

ఆమె బితుకుబితుకుమని చూస్తూ మాట్లాడడానికి ప్రయత్నించింది. యెంతకూ నోరు పెగల్చుకోలేని ఆమె కేసి విసుగ్గా చూశాక ''తెల్లారిజామున్నే పొయినాడంట పట్టాభీ... నాలుక్కో అయిదుకో..'' అన్నాడు బాబాసామి.

''అంత తెల్లారి జామున అక్కడేం కొల్ల బొయ్యిందని పోయినాడు?'' పట్టాభి యెవరితో మాట్లాడుతున్నాడో అర్థం గావడం లేదు.

''చెప్పినాను గదా పట్టాభీ! నిన్న సాయంత్రం యీమె ముండ్ల కంపలు మోపుగట్టేసి అడ్నే యిడిసి పెట్టేసి వచ్చిందంట? అది తెచ్చే దానికి పోయినాడంటలే!'' బాబాసామే జవాబు చెప్పాడు,

''ఆమెతో గూడా నువ్వెందుకు పోయినావు?'' యీసారి గూడా పట్టాభి బాబాసామి వైపుకు తిరగలేదు. బాబాసామి వులిక్కిపడి కంగారుగా ''నేనా... నేను'' అని నత్తివచ్చిన వాడిలా తబ్బిబ్బయిపోయాడు. కాస్సేపటి తర్వాత తేరుకుని ''వాడు. యేకాంబరం – అదే వాని పేరు – వాన్ని పనిలోకి పిల్చుకోని పోదామని వాళ్ళింటికి పోయినాను. అప్పటికే వాడు యింట్లోలేడు. కట్టెలెత్తుకోనొచ్చే దానికి పోయినాడని యీమె జెప్పింది. వాన్నెతుక్కుంటూ పోయినా. వాడు కనబడితే ఆమోపు ఆమె నెత్తిన పెట్టేసి వాన్నట్నే పనిలోకి తోడుక్కొని పోవాలనుకున్నాను'' అని చెప్పాడు.

''పని కోసరం పనోళ్ళు మేస్త్రీల నెతుక్కుంటూ పోతారు. మేస్త్రీలు పనోళ్ళ నెతుక్కుంటా పోతారా యెక్కడైనా?'' పట్టాభి కంఠం చాలా వుదాసీనంగా పలికింది.

''యేకాంబరం సంగతి నీకు తెలియదు పట్టాభీ... వాడు గోకే పనిలో ఎక్స్‌పర్టు... యిద్దరు జేసే పని వాడొకడే చేసేస్తాడు. అందుకే వాని కోసరం పోయినాను''.

''నిన్న కట్టెల్ని మోపు గట్టిన మనిషి దాన్ని యెత్తుకోని పోకుండా యెందుకు బొయ్యింది?'' పట్టాభి మరో కొత్త ప్రశ్నను సంధించాడు.

పైకుబుకుతున్న వెక్కిళ్ళనాపుకుంటూ ''నిన్న రెండు మోపులు గట్టినా నన్నా... వొగటి యెత్తుకొని పోయినాను'' అంది కిట్టమ్మ.

''యింటి కాన్నించీ వాన్నెతుక్కుంటూ నేరుగా బైపాస్‌కే పొయినారా మీరు? లేకపోతే యింకా యెక్కడికైనా పోయినారా? సరిగ్గా గెవనం జేసుకోని చెప్పండి'' పట్టాభి ప్రశ్నల పరంపరను కొనసాగించాడు.

''బయల్దేరిందేమో నేరుగా బైపాస్‌కే'' బాబాసామి నొసలు చిట్లించుకుని విసుగ్గా జవాబు చెప్పసాగాడు. ''కానీ ముందుగా వేశాలమ్మ గుడి యాధిలో వుండే కోమిటాయన అంగిడికి పోయినాం. ఆ కోమిటాయన మీద యేకాంబరం కొంచెం యాష్టగా వుండాడంటలే''.

పట్టాభి వ్యంగ్యం ధ్వనించేలా వొక ముక్కు ముక్కాడు.


''యీమే చెప్పింది...'' బాబాసామి కంగారుపడుతూ చెప్పాడు. ''పొయిన వారం వొకతూరి ఆ అంగిడినించీ కాల్ కేజీ చక్కెర అప్పుగా తెమ్మని కొడుకునంపించిందంటా యీ కిట్టమ్మ. అప్పుగా యిచ్చేది యిష్టం లేకుండా అంగిట్లో చక్కెరయిపొయ్యిందని చెప్పినాడంట ఆ కోమిటాయిన. అందుకే వూర్లో వుండే చక్కెరంతా ఆ మనిషికే వుండాదని యీమె రోషంగా అనిందంట. ఆ మాట యేకాంబరం చెవుల్లో పడిందంట. చక్కిరిస్తేగానీ అంగిట్లో నించీ కదల్నని హటమేసుకుని గుచ్చున్నాడంట. కోమిటాయన యాదిలో వుండే వాళ్ళను పిలిచి మద్దిస్తం బెట్టినా యినలేదంట. సాయంత్రం యీమె బలంతంగా యింటికి లాక్కోని బొయ్యిందంట. ఆమె చెప్పింది ఆ మనిషికుండే రోగం గురించని యేకాంబరానికెంత చెప్పినా మూల కెక్కలేదంట...''

''సరి సర్లే.... అయితే ఆ అంగిడి కాన్నుంచీ నేరుగా బైపాస్‌కే పొయినారు... అంతేగదా?'' పట్టాభి అసహనంగా అడిగాడు.

''అంతే... కానీ దోవలో మంచినీళ్ళ గుంట దగ్గిరుండే రేణుకమ్మ దేవళంకాడికి పోయినాం. పొద్దన్నే ఈ గుళ్లో నమస్కారం బెట్టుకున్నాంక గానీ యేకాంబరం పనిలోకి బోడంట... వొకవేళ వీడు పొయ్యేటయానికి దేవలం తెరవకపోతే ఆ స్వామి వచ్చేదాంకా అక్కడ్నే బండ మాదిరిగా గుచ్చుంటాడంట. వొకనాడు పొద్దన పొయినోడు సాయంత్రం దాకా కట్టు కదల్లేదంట...'' బాబా సామి మరికొంత వివరించాడు.

''వానికేమైనా పిచ్చా? పైత్యమా?'' పట్టాభి మరోసారి నిర్లిప్తంగా అడిగాడు.

''అదే గదా నేను చెప్తావుండాది... వానికి మూల కొంచెం మట్టం. కొంచెమేందిలే, జాస్తీగానే మట్టం. చెవుడు, కండ్ల చూపుగూడా మట్టమే... నత్తిజాస్తీ.... చూసేదానికి యెద్దు మాదిరుంటాడు గానీ చేసే



చేష్టలు మాత్రం పిల్ల కాయలు గూడా చెయ్యరు...''

''అయితే వాని గురించి నువ్వే అన్ని జవాబులూ చెప్పాల్నా? ఆ పెండ్లానికి నోరులేదా?'' పట్టాభి అడ్డు తగిలాడు.

అతడికి కోపం వచ్చినట్టనిపించడంలో కిట్టమ్మ వులిక్కిపడి అంతవరకూ బలవంతంగా ఆపుకున్న యేడుపును బయటికి విడిచిపెట్టింది. బాబాసామి పళ్ళు గొరుకుతూ చూడగానే గొంతు నొక్కుకుని, యేడుపు జీరలమధ్య ''అవును... సా... ఆ మనిషితో యేగలేక జచ్చినాను బతుకంతా... యేదైనా ఆ మనిషి మూలకెక్కించేది చానా కష్టం. వొకటేదైనా యెక్కిందంటే యింగ అది యిడిచిపెట్టడు...'' అంది.

''లాంతరు గ్లాసులో చిగులుకున్న యీగ మాదిరి అదేమాట వాని మూలలో జుయ్యమంటా తిరగతాదంట... పొద్దన యింట్లో బయల్దేరినప్పుడు ఆమె జెప్పిన మాటే యిది.'' బాబాసామి తనను తను సర్దుకుంటూ అందుకున్నాడు.

''అట్లాంటోడు యేపనైనా యేంజేస్తాడు? వానికో సరం నువ్వేతికిందెందుకు?'' పట్టాభి న్యాయవాదిలా ప్రశ్నించాడు.

''నీకు వాని సంగతి తెలియదు పట్టాభీ...'' సరైన సమాధానం దొరికిన ఆనందంతో బాబాసామి ఉత్సాహంగా చెప్పాడు. ''వాడు గోకే పనిలో స్పెషలిస్టు... గోడనో, గ్రిల్‌నో చూపించి గోకమంటే తుప్పట్ల లేకుండా శుద్ధంగా గోకేస్తాడు. అయితే కొంచెం యేమారినామంటే మొత్తానికి మొత్తం అరగరుద్దేస్తాడు. తుప్పర్లు రాలిపోతానే యింగ పని చాలించమని చెప్పాల... లేకపోతే మొదటికే నష్టం... వొకటి రెండుసార్లు యామారి యింటిగల్లోళ్ళ దగ్గిర తిట్లు తిన్నాను...''

అలిపిరి మలుపులో కట్టెలను మోసుకెళ్తున్న ప్రైవేటు లారీ వొకటి కనిపించగానే పట్టాభి గొంతు సవరించుకుని ''సరేలే: పొద్దన్నే యెవరో ఫోనుజేసి చెప్పినారనీ, అనుమానం వచ్చి నేను ఆ తావుకు పొయ్యి చూసినాననీ, యీలోపల మీరు యెతుకులాడతా కనబడినారనీ మా యెస్సయ్యతో చెప్తాన్లే... దాంతో మీ మిందేమీ అనుమానం రాదు. అయితే ఆడివికి కట్టెల కోసమని పొయినాడని చెప్తే మాత్రం దేవస్థానం ఫారెస్టు డిపార్టుమెంటోళ్ళు గొమ్మునుండరు. ఫైనుగట్టమంటారేమో...'' అన్నాడు.

''ఫైనెవరు గట్టేది? చచ్చిపోయిన మనిషా?'' బాబాసామి కోపాన్ని యెగతాళిగా మార్చటానికి ప్రయత్నించాడు.

''ఫైనా? కట్టాల్నా?....'' కిట్టమ్మ మళ్లీ రాగం మొదలు బెట్టింది. ''చూస్తివాన్నా! యీ మనిషి బతికినప్పుడూ నన్ను కాల్చుకోని తిన్నాడు. యిప్పుడు చచ్చి గూడా సాధిస్తా వుండాడు..''

సిగరెట్టు వెలిగించుకున్నాక ఆవిడ మాటలు చెవిన బడనట్టుగా ''ముందుగా మేము బాడీని రుయ్యాసుపత్రికి జేర్చాలి. యెమ్మట్నే కేసుబుక్ చెయ్యాల... మిమ్మల్ని గూడా మావోళ్ళు లక్షరకాలుగా కొశ్చిన్లేస్తారు. మీరు కొంచెం వొళ్ళు దగ్గర బెట్టుకోని జవాబులు చెప్పండి. యీ లోపల యెవరైనా తెల్సిన లాయర్లుంటే చూడండి. మీకు తెలవకపోతే నాకు చెప్పండి. నేనే వొక మంచి లాయర్ని జూస్తాను'' అన్నాడు పట్టాభి.

''లాయరూ.... కేసూ.... దీనికంతా యెంత కర్చవతాది?'' బాబాసామి అడిగాడు.

''ఆ మనిషి సంపాయించిదెచ్చింది ఆ మనిషి తిండికే సరిపోలేదు. నా రెక్కల కష్టంతో సంసారం యీడ్చినాను. యిప్పుడు దీనికంతా సెలవు చేసే దానికి నా దగ్గిరేముండాది?...'' కిట్టమ్మ గొంతు బాధతో, యేడుపుతో మూసుకుపోతోంది.

మరోసారి ఆమె మాటలు వినిపించుకోకుండా ''దానికయ్యే కర్చులు ఆ లాయరే బెట్టుకుంటాడ్లే... యిన్సూరెన్సుకేసేస్తే లక్షో రెండు లక్షలో వస్తాయి. సాంక్షనయినాంక వాని భాగం వాడెత్తుకోని మిగిలింది పార్టీకిస్తాడు..'' అని వివరించాడు పట్టాభి.

''లక్షా? రెండు లక్షలా?...'' బాబాసామి ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

''చచ్చిపోయిన మనిషి వయస్సెంత? యెంత సంపాయిస్తాడు? బతికుంటే యింకా యెంత సంపాదిస్తాడు? యీ సంగతులంతా విచారించి జరిగిన నష్టానికి సరిపోయేటట్టుగా యిన్సూరెన్సోళ్లు దుడ్డిస్తారు. మంచి లాయర్ని బెట్టుకుంటే చచ్చిపోయినోడు మంచి పనోడనీ, భలే సంపాయించుంటాడనీ వాదించి, పెద్ద మొత్తంలో యిన్సూరెన్సు దీసిస్తాడు...'' పట్టాభి మరికొంత వివరించాడు.

బాబాసామి టీ హోటలు కుర్రాడి వైపుకు తిరిగి టీలు తెమ్మని సైగచేశాడు.

''యేకాంబరాన్ని స్పెషలిస్టని పిలస్తావుండామని చెప్పినాను గదా! ఆ మాదిరి పనోడు యింగొకడెవుడ్నీ చూడలేదు నేను. వొగడే యిద్దరు ముగ్గురి పనులు జేస్తాడు. వారానికెంత లేదన్నా వెయ్యో, వెయ్యి అయిదునూర్ల దాంకా పెండ్లాం చేతల్లో పోస్తావున్నాడు. ఆ మనిషి వోయిసేమీ అయిపోలేదు. వ ు ప్పయ్యేం ు ద ం టిందా కిట్టమ్మా!....'' బాబాసామి ఉత్సాహంగా అడిగాడు.

ఆవిడ ముక్కుతూ మూల్గుతూ తల తిప్పింది.

''లాయర్లూ, పోలీసులూ అడిగే ప్రశ్నలకు యీ మాదిరి గొమ్మునా గుచ్చుంటే లాభం లేదు. జవాబులు యిలావిరిగా చెప్పాల... లేకపోతే మీకే నష్టం!'' పట్టాభీ టీ చప్పరిస్తూ హెచ్చరించాడు.

కిట్టమ్మ వొకసారి నిలువెల్లా కదిలి పక్కకు వొరిగింది. నల్లటి చేతులతో తన నల్లటి ముఖాన్ని గట్టిగా రుద్దుకుంది. వెక్కిళ్ళ నాపుకోడం కోసం రెండు గుక్కల నీళ్ళు తాగింది. బలవంతంగా గొంతు పెగుల్చుకుని ''ఆ మనిషి అన్నిపనులు వొక్కడే జేస్తావున్నాడన్నా! అనుకున్న పని అయ్యే దాంకా కట్టుకదిలేటోడు గాదు. దినానికి నూటయాభైకి తగ్గకుండా కూలీ సంపాయిస్తా వున్నాడు... గృహ ప్రవేశాలప్పుడు యింటిగల్లోళ్ళు వెయ్యో, రెండు వేలో యినాంగా యిస్తా వున్నారు'' అంది.

తాగడం ముగించాక ''ఆ తావెక్కడ్నో సరిగ్గా చెప్పు... నేనొకతూరి చూసుకోని టేషనుకు పోతాను..'' అని అడిగాడు పట్టాభి.

''యీ టర్నింగు దగ్గర్నించీ సరిగ్గా రెండు కాలవ తూములకా పక్క... పైన కాకులు అరవటం దూరం నించే గనబడతాది..'' చెబుతూ చెబుతూనే బాబాసామి సరేనన్నట్టుగా చేతులు తిప్పాడు. పట్టాభి వాహనం వీడ్కోలు చెప్పకుండానే బయల్దేరింది.


మోటారుబైకు మలుపు తిరగడం చూశాక ''యీ పోలీసోళ్లకు స్నేహితమూ, బంధుత్వమూ వుండవు. నన్ను గూడా దుడ్డియ్యమని అడగతాడు జూడు'' అన్నాడు బాబాసామి. కన్నీళ్ళ తెరల్లోంచి కిట్టమ్మ చూపులు పైకెత్తింది.

''నీకా యీన్సూరెన్సు సాంక్షనయితానే వాని ముఖాన కొంచెం పారెయ్యి...'' మాట్లాడుతూనే సైకిలు స్టాండు తీసి, సీటు పైకెక్కి కూచున్నాడు బాబాసామి. కిట్టమ్మ వులిక్కిపడి పైకి లేచి ''అయ్యయ్యో! యిప్పుడు నేనాయింటికి వొంటిగా పోలేనన్నా! ఆయింట్లో....'' అంటూ గుక్కిళ్ళు మింగింది.

''సరే! అయితే స్టాండు పైకెక్కు యేకాంబరాన్ని యెతుక్కుంటూ వస్తావుండామని పనోళ్లతో చెప్తాను. నువ్వు కొంచెం మాటతూలకుండా వుండు...'' అంటూ బాబాసామి తూలిపడకుండా సైకిలు హేండలు గట్టిగా పట్టుకున్నాడు. కిట్టమ్మ మూటలా స్టాండు పైన సర్దుకుంది. రోడ్డు తగ్గుగా వుండడంలో సైకిలు మోటరు వాహనంలా జోరుగా పరిగెత్త సాగింది.

అలిపిరి కొండలు యెండల్ని నేలపైకి తిప్పి కొడుతున్నాయి. రోడ్ల పైన పాదచారులు తక్కువగా కనబడుతున్నారు. నీడలు తమపైనున్న వాహనాల్ని తల్లి కోతిని పట్టుకునే పిల్లకోతుల్లా పట్టుకుని పరిగెడుతున్నాయి. రూయాసుపత్రి దగ్గర పండ్ల వ్యాపారులు యెండలతో రాజీ పడుతున్నారు. రోడ్ల కూడళ్లలో నిలబడ్డ విగ్రహాలు నివ్వెర పోయి చూస్తున్నాయి. టౌను క్లబ్బు దగ్గరున్న హోటళ్ళ నీడల్లోకి చెమటలు కక్కుకుంటున్న వ్యక్తులు జొరడుతున్నారు. బాలాజీ కాలనీ కూడలిలో వెలుగుతున్న సిగ్నల్ దీపాలు కృత్రిమమైన ట్రాఫిక్ జామ్‌ను సృష్టిస్తున్నాయి. రైల్వే అండర్ బ్రిడ్జి కింద కాలుతున్న నీడలో ముసలి బిక్షగాడొకడు పెనం పైన కాలుతున్న అట్టులా పడి వున్నాడు. చుట్టూ కట్టిన గ్రిల్ తలుపుల మధ్య తరిగొండ వెంగమాంబ విగ్రహం బంధీ అయిపోయివుంది.

వైకుంఠపురం సిమెంటు తోరణం కనబడగానే



"గంట రెండున్నరవతా వుండాది. ఆ యింటిగల్లా యిన తెల్లారి నుంచీ నేను కనబడ్లేదని గుండం దొక్క తావుంటాడు" అన్నాడు బాబాసామి.

కృష్ణానగర్ మొదటి వీధిలోకి తిరిగాక కాలు కిందికి దించి నేలపైన మోపి, వెనక్కు తిరిగి "రెండు లక్షల దాకా వస్తాదంట. నీ కోసరం యింత కష్టం పడుండాను. నాకెంతిస్తావు కిట్టమ్మా?" అని అడిగాడు బాబాసామి.

"రెండు లక్షలు... రెండు లక్షలు" అంటూ పలవరించాక "ఆ దుడ్డు గురించి నువ్వడగచ్చునా అన్నా! తప్పుగదా!" అని గదమాయించంది కిట్టమ్మ.

"ముందుగా వొకలక్ష బెట్టి యింటిపైన స్లాబేసుకో... యిరవైకో ముప్పయికో బంగారం తెచ్చుకో... వొక యాభై వేలు నమ్మకంగా వడ్డి యిచ్చే వాళ్ళకు బాకీగా యియ్యి... మా వోడొకడు మూడు రూపాయల వడ్డి గూడా కడతానంటావుండాడు. నెల తిరిగేసరికి వడ్డీ దుడ్డు నీ చేతుల్లో బడకపోతే నన్నడుగు" బాబాసామి సలహాలు చెబుతూనే కడుతున్న యింటి ముందు కొచ్చి ఆగాడు. చుట్టూ అడ్డదిడ్డంగా పెరుగుతున్న పిచ్చి మొక్కల మధ్య యిప్పుడిప్పుడే యింటి ఆకారాన్ని సంతరించుకుంటున్న యిల్లు యెబ్బెట్టుగా కనబడుతోంది.

వరండాలో సైకిలు నిలబెట్టాక బాబాసామి యింటి లోపలికి తొంగి చూశాడు. యింకా తడిగా వున్న గోడలతో యిల్లు మంచు పెట్టెలా చల్లగా వుంది. హాలులో నేలపైన పరచిన సవకాలపైన నలుగురు మనుషులు కునుకుతున్నారు.

"రేయ్! దొంగనాకొడకల్లారా! లెయ్యండిరా పైకి... యీ మాదిరి తినేసి పండుకునేదానికేనా నేను మీకు కూలీలిచ్చేది..." వుదయం నుంచీ జరిగిన సంగతినంతా మరుపుకు తెచ్చేటంత కోపం పొంగుకు రావడంతో బాబాసామి పెద్దగా గాంగ్రించాడు.

మిగిలిన వాళ్ళు గూడా పైకి లేస్తుండగా వాళ్ళల్లో వొకతను "యిప్పుడిప్పుడేన్నా! ఆలస్యంగా అన్నం తిని యిప్పుడే అట్ల నడుం వాల్చినాము" అంటూ సిగ్గు పడసాగాడు.

వొకరి వెంట వొకరుగా నలుగురూ బ్రష్షులూ, రంగుల డబ్బాలు చేతబట్టుకుని గదుల్లోకి దూరేశారు.

అందర్నీ బూతులు తిడుతూ పక్కగదిలోకి దూరిన బాబాసామి కెవ్వుమని అరిచాడు... "మ్మేయ్! కిట్టమ్మా! యిట్లురా... యిట్లొకసారి వచ్చిచూడు..."

తప్పదన్నట్టుగా యేడుపురాగం తీస్తున్న కిట్టమ్మ అతడి వెనకే గదిలోకి వెళ్తూ... "యేం... యేం... యేమన్నా!" అని అతడికి ప్రతిధ్వనిలా అరిచింది.

గదిలో గోడకున్న సిమెంటు తుప్పర్లను వుప్పు కాగితంతో రుద్దుతున్న వ్యక్తి తిరిగ్గైనా చూడలేదు.

"మన యేంకాబరంగాడేన్నా! పొద్దన్న మంచినీళ్ల గుంటదగ్గరి కట్టెల మోపుతో గనబడినాడు. వానితో గూడా వాళ్ళింటికి పొయ్యి, ఆమోపు నాయింటి ముందర దింపించేసి, కూడా బెట్టుకోని తొడుక్కొచ్చి నాను" అన్నాడో పెయింటరు.

సిమెంటు గోడకున్న తుప్పర్లను యేకాంబరం తదేక దీక్షతో వుప్పు కాగితంతో రుద్దుతూనే వున్నాడు.

"అయితే వాడు... వీడు... వాడు..." అంటూ బాబాసామి కళవర పడిపోయాడు. తరువాత వెనుదిరిగి "అన్యాయంగా బతికుండే మనిషిని చంపేస్తివే దొంగముండా!" అని ఆక్రోశించాడు.

కిట్టమ్మకు అంతవరకూ మరచిపోయిన వెక్కిళ్ళు మళ్ళీ తన్నుకొచ్చాయి.

"సరిగ్గా చూసుకోని చెప్పాల్సిన పన్లేదా? పాత గుడ్డ పేలికలు చూసి వీడే అనుకునేదేనా?" బాబాసామి దబాయించసాగాడు.

"యీ బండమనిషితో యెట్ల యేగేదన్నా!" కిట్టమ్మ పెద్దగా యేడ్చేసింది.... "మనమింత ఆగమాగం జేస్తావుంటే తిరిగ్గైనా జూస్తావుండాడేమో చూడు..."

"సరైన నిర్వాకం జేసినావులే... నీ ధర్మమా అని అన్యాయంగా అవస్థలు పడినాను. పొద్దన్నించీ నాస్టా గూడా తిన్లేదు..." అంటూ బాబాసామి కోపంతో పళ్ళు కొరికాడు. యింకా పనుల్లోకి దిగ కుండా నిలబడిన పనివాళ్ళు కనిపించగానే "యింకైనా పనెత్తుకోండిరా... అందరికీ వానికున్నట్టుగా మూలలేకుండా వునుంటే యీ లోకమెంతో బాగుపడుణ్ణు..." అని కిళారించాడు బాబాసామి. తరువాత సెల్‌ఫోన్ తీసుకుని "ఆ పోలీసోడు యెతుక్కుంటూ వచ్చినాడంటే యింకా చానా పంచేటు" అని గొణిగాడు.

★


చిరునామా
మధురాంతకం నరేంద్ర,
ప్రొఫెసర్ ఇంగ్లీషు డిపార్టుమెంట్,
ఎస్వీ యూనివర్సిటీ,
తిరుపతి - సెల్: 9866243659